# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 05-02-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ తిరుమల పవిత్రతను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు.
- ❖ ఎస్సీ సబ్ ప్లాన్ నిధుల వినియోగానికి కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి కోరారు.
- ❖ రైతులకు మేలు చేసేలా.. రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలను నిర్వహిస్తోందని ముఖ్యమంత్రి తెలిపారు.
- ❖ కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం (సి.ఐ.ఎస్.ఎఫ్) ఆధ్వర్యంలో సాగుతున్న "వందేమాతరం కోస్టల్ సైక్లోథాన్ -2026" సైకిల్ యాత్ర శ్రీకాకుళం జిల్లాలోకి ఈ రోజు ప్రవేశించింది.

==========================

ప్రసిద్ధ పుణ్య క్షేత్రం తిరుమల పవిత్రతను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. అమరావతిలో ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్, భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, మంత్రులతో కలిసి కీలక సమావేశాన్ని ఆయన ఈ రోజు నిర్వహించారు. అనంతరం పాత్రికేయుల సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ... తిరుపతి లడ్డూ కల్తీ విషయంలో తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ వ్యవహారంలో చర్యలు తీసుకోవాలని సీబీఐ ప్రభుత్వానికి ఒక నివేదిక పంపిందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఏక సభ్య కమిషన్ వేసి అన్నీ పరిశీలిస్తామని అన్నారు. అవసరమైతే కోర్టుకు కూడా అదనపు సమాచారం అందిస్తామని ముఖ్యమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 25 సెకన్లు)

==========================

ఎస్సీ సబ్ ప్లాన్ నిధుల వినియోగానికి కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి కోరారు. అమరావతిలోని వెలగపూడి సచివాలయంలో సాంఘిక సంక్షేమ శాఖ అధికారులతో మంత్రి సమీక్ష సమావేశాన్ని ఈ రోజు నిర్వహించారు. ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు వంద శాతం ఖర్చు చేయాలని ఆదేశించారు. వచ్చే విద్యా సంవత్సరంలో అన్ని హాస్టళ్లలో అడ్మిషన్లు నూరు శాతం పూర్తి కావాలన్నారు. సంక్షేమ హాస్టళ్లు, అంబేద్కర్ గురుకులాల్లో త్వరితగతిన సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరారు. అద్దె భవనాల్లో ఉన్న హాస్టళ్లకు శాశ్వత భవనాల నిర్మాణానికి చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు.

==========================

రైతులకు మేలు చేసేలా రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలను నిర్వహిస్తోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. అమరావతిలో నీటి వినియోగదారుల సంఘాల సమావేశంలో ముఖ్యమంత్రి ఈ రోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... నీటి సంరక్షణ పట్ల అంతా శ్రద్ధ వహించాలని కోరారు. రాష్ట్రంలోని జీవనదుల నీటిని సమర్థవంతంగా వినియోగించుకుంటే కరువనేదే ఉండదని స్పష్టం చేశారు. ప్రతీ ఎకరాకూ నీరు ఇచ్చేలా నీటి వినియోగదారుల సంఘాల ప్రతినిధులు ప్రయత్నాలు చేయాలని కోరారు. భూగర్భ జలాశయంలో నీటి నిల్వ పెరిగేలా చూడాలని సూచించారు. రాయలసీమను ఉద్యానవన కేంద్రంగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ముఖ్యమంత్రి చెప్పారు.

==========================

వందేమాతరం గీత రచనకు 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా `వందేమాతరం కోస్టల్ సైక్లోథాన్ – 2026` రెండో ఎడిషన్ లో భాగంగా కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం (సి.ఐ.ఎస్.ఎఫ్) ఆధ్వర్యంలో ఈ రోజు శ్రీకాకుళం జిల్లాలో సైకిల్ యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. సోంపేట మండలం బారువ సముద్ర తీర ప్రాంతంలో ఇచ్చాపురం శాసనసభ్యుడు, రాష్ట్ర ప్రభుత్వ విప్. బి. అశోక్ సైకిల్ యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సి.ఐ.ఎస్.ఎఫ్. సీనియర్ కమాండర్ డి. జితేంద్ర బాబు  మాట్లాడుతూ.. `సురక్షిత తీరాలు – సమృద్ధ భారతం` అనే నినాదంతో చేపట్టిన ఈ సైక్లింగ్ యాత్ర దేశవ్యాప్తంగా 9 తీర ప్రాంత రాష్ట్రాల మీదుగా సుమారు 6 వేల 500 కిలోమీటర్లు ప్రయాణిస్తుందని తెలిపారు. తీరప్రాంత భద్రతపై అవగాహన పెంచడమే లక్ష్యంగా ఈ సైక్లోథాన్‌ను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలో 8 రోజుల పాటు 964 కిలోమీటర్ల మేర సైకిల్ యాత్ర సాగుతుందని అన్నారు. ముఖ్యంగా తీర ప్రాంత గ్రామాల్లో నివసించే మత్స్యకారులను దేశ భద్రతలో భాగస్వాములుగా మార్చడంతో పాటూ.. అనుమానాస్పద కార్యకలాపాలపై అప్రమత్తత పెంపొందించడమే ఈ సైకిల్ యాత్ర ఉద్దేశమన్నారు.

==========================

రాజధాని అమరావతిలో పలు ప్రాజెక్టుల నిర్మాణాలను రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ ఈ రోజు పరిశీలించారు. సీడ్ యాక్సిస్ రోడ్డును ఓల్డ్ హైవేకు కలిపే స్టీల్ బ్రిడ్జి నిర్మాణ పనులను పర్యవేక్షించారు. గుంటూరు ఛానల్ పై సీడ్ యాక్సిస్ రోడ్డుకు అనుసంధానించే బ్రిడ్జి పనులను కూడా ఆయన పరిశీలన చేశారు. ఈ రెండు బ్రిడ్జిల పనులు త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్ట్ సంస్థ ప్రతినిధులను ఈ సందర్భంగా మంత్రి ఆదేశించారు. అనంతరం విజయవాడ పశ్చిమ బైపాస్ నిర్మాణ పనులను నారాయణ పరిశీలించారు.

విరామం

==========================

“ప్రధానమంత్రి శ్రమయోగి మాన్ ధన్”, “ప్రధానమంత్రి లఘు వ్యాపారి మాన్ ధన్” పథకాలపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని చిత్తూరు జిల్లా రెవెన్యూ అధికారి (డిఆర్ఓ) మోహన్ కుమార్ పేర్కొన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని డిఆర్ఓ ఛాంబర్ సమీపంలోని ప్రత్యేక సమావేశ మందిరంలో జిల్లా కార్మిక శాఖ ఆధ్వర్యంలో అసంఘటిత కార్మికుల సాంఘిక భద్రత చట్టంతో పాటుగా ఈ రెండు పథకాల అమలుపై సమీక్ష సమావేశాన్ని ఈ రోజు నిర్వహించారు.

ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ... అసంఘటిత కార్మికులకు భారత ప్రభుత్వం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టిందని, వాటిపై విస్తృతంగా ప్రజలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు.

==========================

విశాఖపట్టణం డివిజన్ పరిధిలోని నోటిఫైడ్ బార్ అండ్ రెస్టారెంట్లకు సంబంధించిన లైసెన్సుల ఎంపిక ప్రక్రియను ఈ రోజు నిర్వహించారు. లాటరీ ప్రక్రియను జిల్లా సంయుక్త కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి స్వయంగా పర్యవేక్షించారు. డివిజన్ పరిధిలో మొత్తం 52 నోటిఫైడ్ బార్లకు గాను 27 బార్లకు దరఖాస్తులు అందాయని, వాటిలో మూడు బార్లకు ఒకటి కంటే ఎక్కువ దరఖాస్తులు రాగా, మిగిలిన బార్లకు ఒక్కొక్క దరఖాస్తు మాత్రమే వచ్చినట్లుగా ఆమె వెల్లడించారు. బహుళ దరఖాస్తులు వచ్చిన బార్లకు లాటరీ పద్ధతిలో ఎంపిక చేశామని చెప్పారు.

==========================

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని చిత్తూరు జిల్లా పోలీసు సూపరింటెండెంట్ తుషార్ డూడి కోరారు. చిత్తూరు నగరంలోని పి.సి.ఆర్. ప్రభుత్వ కళాశాలలో విద్యారినీ, విద్యార్థులకు `డ్రగ్స్ వద్దు బ్రో` పేరుతో అవగాహన కార్యక్రమాన్ని ఈ రోజు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యార్థులు విద్యపైనే ఎక్కువగా దృష్టి పెట్టాలన్నారు. తమ పిల్లలు ఏం చేస్తున్నారో తల్లిదండ్రులు కూడా ప్రతినిత్యం గమనిస్తూ ఉండాలని సూచించారు.

==========================

డ్వాక్రా సంఘంలో ఉన్న ప్రతి మహిళ చదువుకోవడం ద్వారా వ్యక్తిగత అభివృద్ధితో పాటు కుటుంబం, సమాజం ఆర్థిక అభివృద్ధి చెందుతుందని బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ అన్నారు. ఈతేరు గ్రామంలోని MPP పాఠశాల సముదాయంలో ఉన్న వయోజన విద్యా కేంద్రంలో వయోజన విద్యా శాఖ ద్వారా నిర్వహిస్తున్న అక్షర ఆంధ్ర "అందరికీ విద్య.. మనందరిదీ బాధ్యత.." కార్యక్రమంలో కలెక్టర్ ఈ రోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతి గ్రామంలో ఉన్న డ్వాక్రా సంఘాలలోని మహిళలకు వాలంటీర్లు చదవడం, రాయడం నేర్పించాలని కోరారు.

==========================

మార్కాపురం జిల్లా త్రిపురాంతకంలో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహించడానికి చర్యలు తీసుకోవాలని జిల్లా సంయుక్త కలెక్టర్ పి.శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. మార్కాపురం సబ్ కలెక్టర్ కార్యాలయంలో సంబంధిత శాఖల అధికారులతో ఆయన సమీక్ష సమావేశాన్ని ఈ రోజు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఇబ్బంది కలగకుండా సౌకర్యాలు కల్పించాలన్నారు. బస్సులు, తాగునీరు, ఆలయంలో క్యూ లైన్ ల ఏర్పాట్లు చేయాలని కోరారు.

==========================

రాష్ట్రంలో దిగువ ట్రోపో ఆవరణంలో ఈశాన్య తూర్పు దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం పేర్కొంది. ఆ వివరాలను వాతావరణ కేంద్రం అధికారిణి జి. లక్ష్మి తెలియచేస్తూ...

(వాయిస్ 19 సెకన్లు)

==========================

కేంద్ర ప్రభుత్వం విడుదల చేసే స్మార్ట్ సిటీ నిధులతో తిరుపతిని మరింతగా అభివృద్ధి చేస్తామని తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడా) ఛైర్మన్ దివాకర్ రెడ్డి చెప్పారు. తిరుపతిలోని అవిలాల చెరువు నిర్మాణంలో ఉన్న తుడా టవర్స్ ను సంయక్త కలెక్టర్ గోవిందరావుతో కలిసి ఆయన ఈరోజు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... అవిలాల

చెరువును తిరుపతి ట్యాంక్ బండ్ గా తీర్చిదిద్దుతామని అన్నారు. తిరుపతిని స్మార్ట్ సిటీగా మాత్రమే కాకుండా ఆహ్లాదకరమైన నగరంగా తయారు చేస్తున్నామని తెలిపారు.

==========================

==========================